కేపీసీసీకి ఐదుగురు కార్యాధ్యక్షుల నియామకం

బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి ఐదుగురు కార్యాధ్యక్షుల్ని నియమిస్తూ ఏఐసీసీ శనివారం ఆదేశాలు జారీ చేసింది. కేపీసీసీ కార్యాధ్యక్షులుగా తన్వీర్ సేట్, జీసీ చంద్రశేఖర్, వినయ్ కులకర్ణి, మంజునాథ్ భండారి, వసంతకుమార్ నియమితులయ్యారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రచారకమిటీ అధ్యక్షుడిగా వినయ్ కుమార్ సొరకె, కో చైర్మన్‌గా డాక్టర్ ఎల్.హనుమంతయ్య, వైస్‌చైర్మన్‌గా రిజ్వాన్ అర్షద్‌ను నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు.


అంజలి నింబాల్కర్


గీతా శివరాజ్


ప్రభా మల్లికార్జున


సంయుక్త పాటిల్


సౌమ్యారెడ్డి


ప్రియాంక జార్కిహోళి




శోభాకరంద్లాజె


గాయత్రి సిద్దేశ్వర్

లోక్‌సభ బరిలో ఎనిమిది మంది

కాంగ్రెస్ నుంచి ఆరుగురు, బీజేపీ నుంచి ఇద్దరు

రాష్ట్రంలో ఇదే అత్యధికం



మహిళలకు పెద్దపీట

బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల చరిత్రలో రాష్ట్రంలో ఎన్నడూలేని విధంగా ఏకంగా ఎనిమిది మంది మహిళా అభ్యర్థులు బరిలో ఉన్నారు. కొన్ని దశాబ్దాలుగా పరిశీలిస్తే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెండూ కలిపి ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే మహిళలు ఉండేవారు. అనూహ్యంగా ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో రెండు పార్టీలు ఇంకా పూర్తిగా అభ్యర్థులను ప్రకటించకపోయినా అత్యధికంగా మహిళలకు టిక్కెట్లు దక్కాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి ఏకంగా ఆరుగురు మహిళలు పోటీలో ఉన్నారు. బీజేపీ నుంచి ఇద్దరు పోటీ పడుతున్నారు. దావణగెరె నియోజకవర్గం నుంచి బీజేపీ, కాంగ్రెస్ తరపున ఇద్దరూ మహిళలే బరిలో నిలవడం గమనార్హం. ఇరు కుటుంబాలకు దశాబ్దాలకాలంగా రాజకీయ అనుభవం ఉంది. అభ్యర్థులు మాత్రం తొలిసారిగా పోటీ చేస్తున్నారు. వీరిలో ఎంతమంది లోక్‌సభలోకి అడుగు పెడతారనేది ఎన్నికల ఫలితాలు నిర్ణయిస్తాయి. 1996, 1998 లోక్‌సభ ఎన్నికల్లో 28 నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ మూడు పార్టీలు మహిళలకు టిక్కెట్లు కేటాయించలేదు. 1999 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి ఇద్దరు మహిళలు ఎన్నికకావడం మినహా ఆ తర్వాత కేవలం ఒక్కొక్కరు మాత్రమే విజయం సాధిస్తూ వచ్చారు. 1999లో అప్పటి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, బీజేపీ నుంచి ముఖ్యనేత సుష్మాస్వరాజ్ బళ్లారి నుంచి పోటీ పడగా సోనియాగాంధీ గెలుపొందారు. మార్గరెట్ ఆళ్వా దక్షిణకన్నడ లోక్‌సభ స్థానం నుంచి విజయం నమోదు చేశారు. రాష్ట్రం నుంచి ఇద్దరు ప్రముఖ మహిళా నేతలు లోక్‌సభకు ఎన్నికయ్యారు. కొన్నేళ్లకాలంగా స్థానిక సంస్థల తరహాలోనే చట్టసభల్లోనూ మహిళా ప్రాతినిధ్యం పెరగాలంటే రిజర్వేషన్ పెంచాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. శాసనసభ, లోక్‌సభలలో 33 శాతం మహిళా రిజర్వేషన్ అమలు చేసేలా పార్లమెంటులో ప్రతిపాదించారు. 2029 ఎన్నికల నాటికి ఈ విధానం దేశమంతా అమలు జరగనుంది. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున శివమొగ్గ నుంచి ప్రముఖ నటుడు శివరాజ్‌కుమార్ భార్య, మాజీ సీఎం బంగారప్ప కుమార్తె గీతాశివరాజ్ పోటీ పడుతున్నారు. బెంగళూరు దక్షిణ నుంచి సౌమ్యారెడ్డి, దావణగెరె నుంచి ప్రభా మల్లికార్జున, ఉత్తరకన్నడ నుంచి అంజలి నింబాల్కర్, బాగల్కోటె నుంచి సంయుక్త పాటిల్, చిక్కోడి నుంచి ప్రియాంక జార్కిహోళిలను అభ్యర్థులుగా ప్రకటించారు. ఇక బీజేపీ తరపున కేంద్రమంత్రి శోభాకరంద్లాజె బెంగళూరు ఉత్తర స్థానం నుంచి, దావణగెరె నుంచి కేంద్రమాజీ మంత్రి జీఎం సిద్దేశ్వర్ భార్య గాయత్రి సిద్దేశ్వర్ బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి ఇప్పటికే 24 మంది అభ్యర్థులు ఖరారు కాగా బీజేపీ నుంచి 20మంది పేర్లు ప్రకటించారు. బీజేపీతో జేడీఎస్ పొత్తులో భాగంగా వారికి మూడు స్థానాలు కేటాయించారు. మూడు నియోజకవర్గాలను జేడీఎస్ పార్టీ మహిళలను బరిలోకి దించే ఆలోచనలో లేదు. ఇక బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రకటించాల్సిన జాబితాలకు దాదాపు పేర్లు ఖరారయ్యాయి. వీరిలోనూ ఎవరూ మహిళలు లేరు.



ఉచిత పథకాలపై బీజేపీది ద్వంద్వవైఖరి

నిప్పులు చెరిగిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య

కాంగ్రెస్ గ్యారెంటీలను కాపీ కొట్టిన మోదీ

బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలకు ప్రజాదరణ వెల్లువెత్తడంతో బీజేపీ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని ముఖ్యమంత్రి సిద్దరామయ్య వ్యాఖ్యానించారు. బెంగళూరులోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో శనివారం గ్యారెంటీ పథకాల అమలు కమిటీ రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి సమితి అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. నిరుపేదల కడుపు నింపుతూ వారి కళ్లల్లో ఆనందం చూడాలని కాంగ్రెస్ పరితపిస్తుంటే మతం పేరిట భావోద్వేగాల చిచ్చు రేపుతూ బీజేపీ ఓట్లు దండుకోవాలని చూస్తోందన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలను మోదీ కాపీ కొట్టారని ఎద్దేవా చేశారు. ఉత్తరాదిలోని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉచిత పథకాల అమలుపై లేని అభ్యంతరం దక్షిణాదిన అమలు చేస్తే ఎందుకని ఆయన ప్రశ్నించారు. అచ్చే దిన్ అంటూ గత పదేళ్లుగా దేశప్రజలను ప్రధాని మోదీ మభ్య పెడుతూ వచ్చారన్నారు. రైతుల ఆదాయం పెరిగిందా... డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గాయా... ఏడాదికి రెండు కోట్ల మందికి ఉద్యోగాలు ఎక్కడా అంటూ ప్రధానికి ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు గ్యారెంటీ పథకాలను ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా తట్టుకుని అమలు చేస్తోందని పేర్కొన్నారు. గ్యారెంటీ పథకాల ద్వారా కులాలు, మతాలకు అతీతంగా ప్రజలంతా లబ్ధి పొందుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారెంటీలను తమవిగా బీజేపీ ప్రచారం చేసుకుంటోందని ఆయన విమర్శించారు. పచ్చి అబద్ధాలతో ప్రజలను ఎల్లకాలం మభ్యపెట్టలేరని తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయాన్ని బలంగా తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. కేపీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ గ్యారెంటీ పథకాల అమలు కమిటీ అధ్యక్షుడు హెచ్‌ఎం రేవణ్ణ, ఉపాధ్యక్షురాలు పుష్పా అమరనాథ్‌తోపాటు సీనియర్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

వద్దంటే టిక్కెట్ ఇచ్చారు..!

విజయపుర బీజేపీ అభ్యర్థి రమేష్ జిగజిణగి



బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): 'విజయపుర ప్రజల అభిమానానికి వెలకట్టలేను.. వరుసగా గెలిపిస్తూ వచ్చారు.. ఈ సారికి టిక్కెట్ వద్దన్నాను, అయినా అధిష్టానం నా పేరు ప్రకటించింది' అని బీజేపీ ఎంపీ రమేష్ జిగజిణగి తెలిపారు. శనివారం విజయపురలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు టిక్కెట్ దక్కకుండా చేసేందుకు పలువురు ప్రయత్నించారని పేర్కొన్నారు. కానీ అధిష్టానం టిక్కెట్ కేటాయించిందని, అందుకు అనుగుణంగానే ప్రచారాలు ప్రారంభించానని తెలిపారు. పలు చోట్ల అభిమానులు, పార్టీ కార్యకర్తలు మీరు రాకున్నా ఓట్లు వేసి గెలిపిస్తామని అంటున్నారని వివరించారు. ఎన్నికల సందర్భంగా గ్రామాల వారిగా తిరిగి ప్రజలను ఓట్లు వేయాలని కోరుతానని అన్నారు. ఇవే మీ చివరి ఎన్నికలా అని మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఇప్పటికే ప్రత్యక్ష రాజకీయాలకు గుడ్‌బై చెబుతానని ప్రతి చోటా బహిరంగంగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. 90 ఏళ్లు వచ్చినా టిక్కెట్ అడుగుతూ ఉండాలా అంటూ ఎదురు ప్రశ్నించారు. ప్రస్తుత ఎన్నికలలోనే పోటీ చేయరాదని తనతో పాటు కుటుంబ సభ్యులంతా కలిసి నిర్ణయం తీసుకున్నామన్నారు. అధిష్టానం మీరు పోటీ చేయాల్సిందే అంటూ టిక్కెట్ ఇచ్చిందన్నారు. ఇటీవల కొంత అనారోగ్యం కారణంగా వైద్యం పొందానని, ప్రస్తుతం బాగున్నట్లు తెలిపారు. ఈశ్వరప్ప కుమారుడికి టిక్కెట్ తప్పడంతో ఆయన రెబల్‌గా పోటీ చేస్తే పరిస్థితి ఏమిటన్న ప్రశ్నకు సమాధానంగా ఈశ్వరప్ప సంఘ్‌పరివార్ నుంచి వచ్చిన వారని, తాను కాదన్నారు. రామకృష్ణహెగ్డే, జేహెచ్ పటేల్ సహకారంతో ఎదిగానని గుర్తు చేసుకున్నారు.

రామేశ్వరం కెఫె పేలుళ్ల సూత్రధారుల గుర్తింపు..?

బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం కెఫెలో బాంబు పేలుళ్ల సూత్రధారులను ఎన్‌ఐఏ అధికారులు గుర్తించినట్టు సమాచారం. బాంబు పేలుడుకు అవసరమైన బ్యాగును తీసుకొచ్చి కెఫెలో ఉంచిన వ్యక్తితోపాటు అతడికి సహాయపడిన వ్యక్తిని గుర్తించినట్టు తెలుస్తోంది. ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కల్గిన వారే కుట్రకు సూత్రధారులనే నిర్ణయానికి వచ్చారు. శివమొగ్గ జిల్లా తీర్థహళ్లికి చెందిన ముసావీర్ హుసేన్ శాబీబ్ బాంబు పెట్టిన వ్యక్తిగా నిర్ధారించినట్లు సమాచారం. ఇతడు కొన్నేళ్లకాలంగా తలదాచుకున్నాడు. ఇతడిని గుర్తించేందుకు దర్యాప్తు సంస్థలు బహుమతులను ప్రకటించాయి. ముసావీర్‌కు తీర్థహళ్లికి చెందిన అబ్దుల్‌మథీన్ అహ్మద్ తహ సహకారం అందించినట్టుగా ఎన్‌ఐఏ అధికారులు నిర్ణయానికి వచ్చారు. వారు కెఫెలో బాంబుపేలుళ్లకు ముందు చెన్నైలో ఉన్నట్టు గుర్తించారు. సమాజంలో పేలుడు వంటి సంచలనాలు సృష్టించేందుకు కచ్చాబాంబు తయారీ చేయడం ఎలా అనే శిక్షణ పొందారని శివమొగ్గ జిల్లా గురుపురు - పొరలె సమీపంలో తుంగానది ఒడ్డున బాంబులను పేల్చే పరీక్షలు చేసినట్టు గతంలోనే నిర్ధారించారు. ప్రస్తుతం జైలులో ఉన్న మాజ్ మునీర్ అహ్మద్, ఇతరులతో ముసావీర్ సంబంధాలు కలిగి ఉన్నారని ఎన్‌ఐఏ నిర్ధయించింది. ఈమేరకు వారిని గుర్తించేందుకు ఎన్‌ఐఏ బృందాలు గాలింపులు కొనసాగిస్తున్నాయి.

బీజేపీలో బుజ్జగింపుల పర్వం

ఈశ్వరప్పతో సంప్రదింపులకు సిద్ధమైన అధిష్టానం.. మాధుస్వామితో యడియూరప్ప చర్చలు..





బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ టిక్కెట్లు ఆశించి భంగపడి తీవ్ర ఆగ్రహంతో ఉన్న పలువురి నేతలతో రాష్ట్ర, కేంద్రం పెద్దలు చర్చల ద్వారా రాజీ కుదిర్చేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. పార్టీ సీనియర్‌నేత ఈశ్వరప్ప కుమారుడు కాంతేష్‌కు హావేరి టిక్కెట్ ఇప్పించేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. అనూహ్యంగా హావేరి నుంచి మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్‌బొమ్మైను అభ్యర్థిగా చేయడంతో ఈశ్వరప్ప రగిలిపోతున్నారు. జీవితకాలం బీజేపీ కోసమే పనిచేశామని, కానీ రాష్ట్రంలో యడియూరప్ప కుటుంబానిదే హవాగా చేసుకున్నారని మండిపడ్డారు. శివమొగ్గ నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ దిశగా ప్రయత్నాలు నిరంతరంగా సాగిస్తున్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి రాధామోహన్‌దాస్ అగర్వాల్‌తో పాటు రాష్ట్రపార్టీకు చెందిన ప్రతినిధులు ఇటీవలే ఈశ్వరప్పతో చర్చలకు వెళ్లగా ఆయన పట్టించుకోలేదు. ఈశ్వరప్ప పోటీలో కొనసాగితే యడియూరప్ప కుమారుడు రాఘవేంద్ర గెలుపు అంతసులువు కాదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నామినేషన్ల పర్వం ప్రారంభానికి ముందే కేంద్రం నుంచి కొందరు నేతలు ఈశ్వరప్పతో రాజీ ప్రయత్నాలు చేస్తారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తుమకూరు టిక్కెట్ ఆశించి భంగపడిన మాజీ మంత్రి మాధుస్వామి ఆగ్రహంతో ఉన్నారు. స్థానికేతరుడికి టిక్కెట్ ఇస్తే తాను ఎందుకు మద్దతు ఇస్తానని, అభ్యర్థి సోమణ్ణకు సహకరించేది లేదని తేల్చి చెప్పారు. ఒకానొక దశలో మాధుస్వామి కాంగ్రెస్‌కు వెళతారనే ప్రచారం నేపథ్యంలో ఆయన రెండురోజుల కిందటే స్పందించారు. ఎట్టి పరిస్థితిలోను పార్టీ వీడేది లేదన్నారు. శనివారం నేరుగా సీనియర్‌నేత యడియూరప్ప రంగంలోకి దిగారు. శుక్రవారం యడియూరప్ప స్వయంగా మాధుస్వామికి ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో పార్టీ ఎమ్మెల్యేలు గోపాలయ్య, భైరతీ బసవరాజు సహా పలువురితో కలిసి మసాలా జయరాం తోటకు వెళ్లారు. అక్కడికి మాధుస్వామిని రప్పించి చర్చలు జరిపారు. టిక్కెట్ ఇప్పిస్తానంటూ మోసం చేశారని యడియూరప్ప పైనా మాధుస్వామి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సుదీర్ఘ చర్చల తర్వాత మాధుస్వామి కాస్త మెత్తబడినట్లు తెలిసింది. ఇదే విషయమై యడియూరప్ప మీడియాతో మాట్లాడుతూ మాధుస్వామి పార్టీ వీడేది లేదని అదంతా కేవలం కల్పితమే అన్నారు. మాధుస్వామి ఎప్పటికీ బీజేపీలోనే ఉంటారన్నారు.



హనుమంత వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

కదిరి, మార్చి 23: పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీలక్ష్మీనరసింహ స్వామి బ్రహోత్సవా ల్లో భాగంగా శనివారం స్వామివారు తన బంటు అయిన హనుమంతుని భుజాలపై ఆసీనులై, పురవీధుల్లో విహరించారు. ఉదయం నిత్యపూజలు, హోమాల అనంతరం శ్రీవారికి ప్రత్యేకాలంకరణలో గ్రామోత్సవం నిర్వహిస్తారు. త్రేతాయుగంలో రామలక్ష్మణలను తన భుజస్కందాలపై మోసిన హనుమంతుడు, కలియుగంలో మరోసారి నారసింహుడికి వాహనంగా మారి, తన కోరికను తీర్చుకుంటారని భక్తుల విశ్వాసం. రంగురంగుల విద్యుద్దీపాలు, మల్లె సౌరభాల నడుమ తిరువీధుల్లో విహరించిన శ్రీవారిని దర్శించుకోవడానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. నారసింహ నామస్మరణతో కదిరి పురవీధులు మార్మోగాయి.



వికసిత భారత్ నిర్మాణమే లక్ష్యం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర



జ్యోతి ప్రజ్వలనలో విజయేంద్ర, అశోక్ తదితరులు, హాజరైన ప్రతినిధులు

బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభకు జరుగుతున్న ఎన్నికలు వికసిత భారత నిర్మాణం కోసమేనని, భారత్ గెలవాలి... ఈ దిశలో పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ భుజస్కంధాలపై గురుతర బాధ్యత ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర పేర్కొన్నారు. బెంగళూరు ప్యాలెస్ మైదానంలో శనివారం ఏర్పాటు చేసిన పార్టీ ఎన్నికల నిర్వహణా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. దేశంలోని 140 కోట్ల మంది ప్రజల సంక్షేమంతో కూడిన వికసిత భారత్ గురించి ఓటర్లలో విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రత్యేకించి యువ ఓటర్లను ఆకర్షించాలని ఆయన సూచించారు. గత పదేళ్లుగా ప్రధాని మోదీ భారత దేశ కీర్తి ప్రతిష్ఠలను రెపరెపలాడించడంతో పాటు బలిష్ఠ, సురక్షిత భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. లోక్‌సభ ఎన్నికల రాష్ట్ర ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్ అగర్వాల్ మాట్లాడుతూ 28 నియోజకవర్గాల్లోనూ మోదీయే పోటీలో ఉన్నారనే అభిప్రాయం ప్రజల్లోకి బలంగా వెళ్లేలా చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో ప్రతిపక్ష నేత ఆర్.అశోక్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్నికల నిర్వహణా కమిటి కన్వీనర్ వి.సునిల్‌కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శులు ప్రీతం గౌడ, పి.రాజీవ్, ఎమ్మెల్సీలు భారతి శెట్టి, కేశవప్రసాద్‌తో పాటు పదాధికారులు, ముఖ్యనేతలు పాల్గొన్నారు.

ఘనంగా ఐఐబీఎస్ సంస్థాపనా దినోత్సవం




సంస్థాపనా దినోత్సవం ప్రారంభంలో ప్రముఖులు

బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో నాక్ ఏ గ్రేడ్‌తో బెంగళూరు యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బిజినెస్ స్టడీస్ (ఐఐబీఎస్) తన సంస్థాపనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకొంది. లూమినార్స్ 2024 పేరిట జరిగిన ఈ కార్యక్రమాన్ని బెంగళూరు సిటీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆనంద్‌కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. ఉన్నత విద్యారంగంలో ఐఐబీఎస్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. బిజినెస్ చైర్మన్ జయప్రకాశ్ మాట్లాడుతూ 2008లో ఏర్పాటైన తమ సంస్థ 16ఏళ్ల మజిలీని విజయవంతంగా పూర్తి చేసుకుందన్నారు. ఐఐబీఎస్‌లో శిక్షణ పొందిన ఎందరో విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. సంస్థాపనా దినోత్సవంలో ప్రిన్సిపాల్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ త్రిపురనేని జగ్గయ్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహేశ్వర్‌రెడి, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ కుల్‌దీప్‌శర్మ, అడ్మిషన్ డైరెక్టర్ అమరజిత్‌కుమార్ గౌతమ్, బెంగళూరు యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రితికిసిన్హా, బీ దేవి చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి డాక్టర్ గుంజన్‌కుమారి తదితరులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా పలువురు ప్రముఖులను వేదికపై ఘనంగా సత్కరించారు. 2023 అలూమిని మ్యాగజైన్‌ను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు సమర్పించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈమేరకు ఐఐబీఎస్ నగరంలో శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది.



ఇఫ్తార్	: ఆదివారం సాయంత్రం 6:32
సెహరి	: సోమవారం ఉదయం 05:08



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,581.94	1,592.20
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	2,191
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	744	8,622
సామర్థ్యం (టీఎంసీలు)	5.48	12.97

తుంగభద్ర జలాశయం పక్కనే తీవ్ర నీటిఎద్దడి

- తాగునీరులేక తడారిపోతున్న గ్రామాలు
- నెల రోజులకు ఒక సారి.. అదీ గంట పాటే సరఫరా



నీరులేక పాచి పట్టిన నీటిట్యాంకు

బళ్లారి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నెల రోజులు గడిచిపోయింది. కొళాయిల్లో నీళ్లు రావడం లేదు. రోజు రోజుకూ పరిస్థితి జటిలమౌతోంది. ఎలా బతకాలిరా దేవుడా! అని జనం తల్లిడిల్లిపోతున్నారు. ట్యాంకులకు నీరు అందించేందుకు ఏర్పాటు చేసిన బోర్ల లో నీరు రాక ఎండిపోయాయి. తాగేనీరు ఏదోలా కొని తెచ్చుకుంటున్నామని, వాడేందుకు, పశువులకు ఇతర అవసరాలకు నీరు దొరకడం లేదని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్ర జలాయం ఉన్న జిల్లాలోనే తీవ్ర నీటిఎద్దడి నెలకొనడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం మౌతోంది. బళ్లారి, విజయనగర, కొప్పళ, రాయచూరు జిల్లాలో మునుపు ఎన్నడూ లేని విదంగా తాగునీటి ఎద్దడి నెలకొంది. తుంగభద్ర జలాశయం నుండి తాగునీరు అందించేందుకు ఈ మూడు జిల్లాలో సుమారు 18 వాటర్ స్టోరేజ్ ట్యాంకులు నిర్మించారు. తుంగభద్ర డ్యాం నుండి కాలువలకు నీరు విడుదల చేసిన సమయంలోనే పంపుల ద్వారా స్టోరేజీ ట్యాంకుల్లోకి నీరు నింపి అక్కడ నుండి పైపుల ద్వారా ప్రజలకు సరఫరా చేసేవారు. కానీ ఈడాది వర్షాభావ పరిస్థితి కారణంగా తుంగభద్ర జలాశయంలో నీరు లేక అడుగంటి పోయింది.

ముందుజాగ్రత్తగా ట్యాంకులు నింపకపోవడం కారణంగా స్టోరేజీ ట్యాంకులు కూడా నీరు లేక వెలవెలబోతున్నాయి. బళ్లారి, విజయనగరం లాంటి ప్రాంతాల్లోనే నెలరోజులకో సారి తాగునీరు ఇవ్వడానికి ట్యాంకుల్లో నీరు లేని పరిస్థితి నెలకొంది. జిందాల్, హడగలి, కూడ్లిగి, హగరీ బొమ్మనహళ్, లాంటి ప్రాంతాలు తుంగభద్ర జలాశయానికి అనుకునే ఉంటాయి. కానీ అక్కడ కూడా నీరు అందక జనం ఇబ్బంది పడుతున్నారు. చాలా మంది మినరల్ వాటర్ తెచ్చుకుని దాహం తీర్చుకుంటున్నారు. కాని పశువులు, ఇతర అవసరాలకు మురికినీరు వాడుకునే పరిస్థితి నెలకొంది. పశువులను మురికి కాలువల వద్దకు తోలుకువెళ్లి వాటి దాహం తీర్చే ప్రయత్నం చేస్తున్నా అవి నీరు తాగడం లేదు, ఇక ఏమి చేయాలో తెలియక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిందాల్ లాంటి పరిశ్రమలు ఉండే ప్రాంతంలో కార్మికులు ఎక్కువగా ఉన్నారు. అక్కడ వారికి తాగునీరు దొరక్క ఇబ్బంది పడుతున్నారు. పాలకులు, అధికారులు సరైనచర్యలు తీసుకుని ప్రజలకు తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

హరప్పనహళ్లిలో ట్యాంకర్లదే హవా



నీటిని బిందెలతో తీసుకెళుతున్న దృశ్యం

కంప్లి, మార్చి 23 : విజయనగర జిల్లాలోని హరప్పనహళ్లి పట్టణంలో ఏ వార్డులో చూసినా నీటి ఎద్దడితో ప్రజలు అల్లాడుతున్నారు. ఇప్పటికే బోర్లలో నీరు ఇంకి పోయి, తుంగభద్ర జలాశయం నుంచి వచ్చే నీరు తగ్గిపోవడంతో సుమారు తాలుకాలోని 64కు పైగా గ్రామాలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. ప్రతినిత్యం ప్రైవేటు ట్యాంకర్ల వద్ద బిందె రూ. పది ప్రకారంగా కొనుగోలు చేసుకుని దాహార్తిని తీర్చుకుంటున్నామని ప్రజలు అంటున్నారు. రోజురోజుకు పట్టణంలో నీటి సమస్య తీవ్రమవుతోంది. అధికారులు ఇప్పటికైనా నీటి సమస్యను దృష్టిలో వుంచుకుని ట్యాంకర్లతో గానీ, బోర్లు వేయించి గానీ నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికే ట్యాంకర్ల ద్వారా వచ్చిన నీటిని ఒకరిపైఒకరు నెట్టుకుంటూ నీటిని తీసుకునే పరిస్థితి నెలకొందన్నారు.

ఘనంగా రేణుకాచార్య జయంతి



నివాళులర్పిస్తున్న కన్నడ సాంస్కృతిక శాఖ ఏడీ నాగరాజు

బళ్లారి సిటీ, మార్చి 23: ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రేణుకాచార్య జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల మోడల్ ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున నగరంలోని డా.రాజ్‌కుమార్ రోడ్డులోని కన్నడ సాంస్కృతిక శాఖ భవనంలో శ్రీ రేణుకాచార్య చిత్రపటాన్ని అవిష్కరించి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకుడు నాగరాజు, వీరశైవ లింగాయత్ సమాజ్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అమరవీరుల దినోత్సవం



అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఏఐడీఎస్‌ఓ

బళ్లారి సిటీ, మార్చి 23: దేశ స్వాతంత్ర్యం కోసం రాజీలేని పోరాటం చేసి ఉరి తీయబడిన భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు వంటి గొప్ప విప్లవకారుల స్మారకంగా శనివారం అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మున్సిపల్, విమ్స్ మైదాన్ సహా జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు ఏఐడీఎస్‌ఓ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విరివిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికిరణ్ మాట్లాడుతూ, విప్లవం వల్ల మనిషిని మనిషి దోపిడి చేయడం సాధ్యం కావడంలేదని, అలాంటి విప్లవ సందేశాన్ని విద్యార్థులు, యువకులు ప్రతి గడపకు తీసుకెళ్లాలన్నారు. సామ్రాజ్యవాద దోపిడీని అంతం చేయడానికి సోషలిస్టు విప్లవం అవసరమన్నారు. ఆకలి, పేదరికం, నిరుద్యోగం లేని సోషలిస్టు భారతదేశాన్ని నిర్మించాలన్న భగత్‌సింగ్ కలను సాకారం చేసుకునే దిశగా విద్యార్థులు, ముందడుగు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏఐడీఎస్‌ఓ జిల్లాధ్యక్షుడు కే.ఈరన్న, జిల్లాకార్యదర్శి కంబలి మంజునాథ్, శాంతి, ప్రమోద్, కోశాధికారి అనుపమ, సభ్యులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

వేసవిలో విషసర్పాలతో జాగ్రత్త!



పోస్టర్లను విడుదల చేస్తున్న సమీర్ సేట్ తదితరులు

బళ్లారి సిటీ, మార్చి 23: వేసవి తాపానికి సర్పాలు ఎక్కువగా బయటకు వస్తుంటాయని, కనుక ప్రజలు వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకొని తమను రక్షించుకోవాలని వన్యజీవుల సంరక్షణా వేదిక అధ్యక్షులు సమీర్‌సేట్ తెలిపారు. నగరంలోని పత్రికాభవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విషసర్పాల బారినుంచి జాగ్రత్తగా రక్షించుకోవాలన్నారు. పాము కరిచినపుడు నాటు వైద్యం చేయించుకోకుండా ప్రభుత్వ ఆసుపత్రికి పోవాలని తెలిపారు. అంతేకాకుండా తమ ఇంటి చుట్టుప్రక్కల చెత్తాచెదారాన్ని తీసివేసి శుభ్రంగా ఉంచుకోవాలని, లేనిచో అక్కడకి పాములు చేరుకుంటాయన్నారు. ఎక్కడైనా తమ ఏరియాల్లో పాము కనబడితే కొట్టిచంపరాదని తమసంస్థ నంబరు 9880031600కు ఫోన్ చేస్తే తామే వచ్చి పామును పట్టుకుని అరణ్యంలో వదిలేస్తామన్నారు. ఇప్పటి వరకు తమ సంస్థ సుమారు 20వేలకు పైబడి పాములను సంరక్షించిందన్నారు. పాములపై అవగాహన కల్పించడానికి పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా శహీర్‌సేట్, హొతూరు సిరాజ్, అస్లాం, బాబు, ఇస్రాకైసర్ సేట్ పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు

బళ్లారిరూరల్, మార్చి 23 : ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో లోక్‌సభ ఎన్నికల సందర్భంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. తాలూకాలోని పీడీహళ్లి, చేళగుర్కి. చెక్‌పోస్టు, రూపనగుడి, కారేకల్, సింధవళం తదితర ప్రాంతాల్లోని చెక్‌పోస్టులతోపాటు ఆంధ్ర కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ఎస్పీ రంజిత్ కుమార్ భండారి, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఆదేశాలతో అధికారులు ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. బొమ్మనహాళ్, రాయదుర్గం, డీహీరేహాళ్, అనంతపురం, కడప సరిహద్దు ప్రాంతాలలోగల చెక్‌పోస్టులను పరిశీలించి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అదేవిధంగా రాత్రి సమయాల్లో పీడీహళ్లి సీఐ రుద్రప్ప, సతీష్, ఎస్ఐ నాగభూషణ, మోకా ఎస్ఐ కాళింగ, సంతోష్‌తోపాటు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు దుర్గాప్రసాద్, ఉమేష్, షబ్బీర్ అలీ, అజీమ్ బాషా, పలువురు అధికారులు చెక్‌పోస్టుల వద్ద క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గత పది రోజుల నుంచి నిర్వహిస్తున్న తనిఖీల్లో బంగారం, వెండి, నగదు తదితర వాటిని స్వాధీనం చేసుకొన్నారు.



రూపనగుడి చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

నగదు, గంజాయి స్వాధీనం : డీసీ

బళ్లారి సిటీ,మార్చి 23: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి జిల్లావ్యాప్తంగా మోడల్ ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేశామని, శుక్రవారం 629. లీటర మద్యం, నగదు రూ.26లక్షలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని జిల్లాఎన్నికల అధికారి, జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు. సండూర్ తాలూకాలోని చోరనూర్ సమీపంలో 130గ్రాముల గంజాయి, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని, ఇప్పటి వరకు మొత్తం 44 కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మండుతున్న ఎండలతో నగరం నిర్మానుష్యం



● నిర్మానుష్యంగా వున్న విమ్స్ రహదారి



● రాయల్ సర్కిల్ వద్ద సందడి లేని దృశ్యం

బళ్లారి జిల్లాలో వేసవి ఉష్ణోగ్రతలు అధికం కావడంతో నగరవాసులు ఎండవేడిమికి ఇంటికే పరిమితమవుతున్నారు. వేసవి ప్రారంభం కావడంతో ప్రజలు వస్తువులను కొనుగోలు చేసేందుకు గానీ, ఇతర పనులకు గానీ బయటకు రాలేకపోతున్నారు. దీంతో ఉదయం 11 గంటలకు నగరంలోని ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. విమ్స్ రహదారిలో శనివారం మానవ సంచారమే కన్పించలేదు. మామూలుగా ఎప్పుడూ రద్దీగా ఉండే రాయల్ సర్కిల్ వద్ద ఒకరిద్దరూ మాత్రమే కన్పించారు.

- బళ్లారిరూరల్

వైభవంగా జోడు రథోత్సవం

కంప్లి, మార్చి 23 : విజయనగర జిల్లా కొట్టూరు పట్టణం కోటభాగంలో కొలువైన వీరభద్రేశ్వరస్వామి, రేణుకాచార్య స్వామివార్ల జోడు రథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీఎత్తున పాల్గొని మొక్కులు సమర్పించుకున్నారు. అలాగే కంప్లి పట్టణంలో కూడా వీరశైవసమాజం రేణుకాచార్య జయంతిని కన్నుల పండువగా నిర్వహించుకున్నారు. ఈ విషయాలను వీరశైవ సమాజసభ్యులందరూ గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజ్, మూకయ్యస్వామి, చౌకినమఠ బసవరాజు శాస్త్రి, హేమయ్య స్వామి, చంద్రశేఖర్‌గౌడ, రాజ్‌కుమార్, సచిన్, వీరశైవ సమాజం పదాధికారులు పాల్గొన్నారు.



కొట్టూరులో ఊరేగుతున్న వీరభద్రేశ్వరస్వామి, రేణుకాచార్య స్వామి రథాలు

శ్రవణానందకరంగా శివపురాణ ప్రవచనం

సిరుగుప్ప, మార్చి 23: చాణుక్యనూరు గ్రామంలో శివపురాణ ప్రవచన కార్యక్రమం శనివారం శ్రవణానందకరంగా జరిగింది. కార్యక్రమంలో కౌతాలం మండలం హాల్వి అభినవ మాంత స్వాములు పాల్గొన్నారు. భగవంతుని స్మరించడం వలన మనిషికి శాంతి, ఐశ్వర్యం, సంపద కలుగుతాయని ఆయన తెలిపారు. బీజేపీ జిల్లా యూత్ అధ్యక్షులు ఎంఎస్ సిద్దప్ప, అభినవ మాంత స్వాములకు పాదాభివందనం చేసి దర్శనం పొందారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

బ్రిడ్జి కమ్ బ్యారేజీ పనుల పరిశీలన



బ్యారేజీ పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప, మార్చి 23 : బ్రిడ్జి కమ్ బ్యారేజీ పనులను మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప శనివారం పరిశీలించారు. సిరుగుప్ప తాలుకాలోని బలకుంది, ముదియనూరు గ్రామాల మధ్య హగరి నదిపై బ్రిడ్జి కమ్ బ్యారేజీ పనులు జరుగుతున్నాయి. వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు ఈ పనులను పూర్తి చేస్తే మూడు వేల హెక్టార్ల భూములకు సాగునీరు అందుతుందని ఆయన తెలిపారు. కర్ణాటక నుంచి ఆంధ్ర ప్రాంతంలోని ఆదోనికి కూడా తక్కువ సమయంలో చేరుకునేందుకు సాధ్యపడుతుందని తెలిపారు. పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ స్థలాన్ని బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు.

రేవణ సిద్దయ్య సేవలు మరువలేనివి



రేవణ సిద్దయ్య పుణ్యస్మరణలో పాల్గొన్న ప్రముఖులు

కంప్లి, మార్చి 23 : మాజీ సీయం, మాజీ ఎమ్మెల్యే రేవణ సిద్దయ్య సేవలు మరువలేనివని శ్రీశైల కదలివన పరమపూజ్య చిదానందప్ప తాత తెలిపారు. శనివారం సిరిగేరి గ్రామంలో రేవణ సిద్దయ్య 13వ వర్ధంతి సందర్భంగా పూజలు నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవణ సిద్దయ్య హయాంలో సురక్షిత పాలన వుండేదన్నారు. రైతుల కోసం న్యాయపోరాటాలు చేశారన్నారు. రైతులకు అండగా వుంటూ తనదైన శైలిలో గుర్తింపు పొందారన్నారు. రైతు సంఘం నాయకులు దరూరు పురుషోత్తమ గౌడ మాట్లాడుతూ ఆయన ఎమ్మెల్యేగా వుంటూ ఏ సమస్య వచ్చినా తన సమస్యగా భావించి పరిష్కరించేవాడన్నారు. అప్పట్లో రైతులకు ఎటువంటి సమస్య వుండేది కాదన్నారు. ప్రతి ఒక్క రైతు సమస్యను తన సమస్యగా భావించి నాయకుడిగా గుర్తింపు పొందారన్నారు. ఎన్ని తరాలు పోయినా ఇప్పటికీ సిరిగేరి గ్రామంలో ప్రతి ఒక్క మనిషి గుండెల్లో ఆయన నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో నాగరాజు స్వామి, సిద్దలింగయ్య స్వామి, మల్లయ్య స్వామి, బోడె చంద్రశేఖర్‌గౌడ, డాక్టర్ మృత్యుంజయ స్వామి, వైద్యాధికారి ఈరన్న, నాగరాజు, మహమ్మద్, సోమశేఖరప్ప, అడివయ్య స్వామి, కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు నాగరాజు స్వామి పాల్గొన్నారు.

రాయచూరు నగరంలో రిజర్వు పోలీసుల కవాతు

రాయచూరు, మార్చి 23: లోకసభ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రిజర్వు పోలీసులు శనివారం నగరంలో కవాతు నిర్వహించారు. ప్రధాన రహదారులు, రోడ్డు కూడళ్ల గుండా సాగిన రిజర్వు పోలీసుల కవాతు దాదాపు మూడు గంటలకు పైగా కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్పీడీఎస్పీ, సీఐ, ఎస్ఐలతో పాటు మిలిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

హోసూరు జోన్

ఓటు హక్కుపై జాగృతి ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

హోసూరు(కృష్ణగిరి), మార్చి 23: లోక్‌సభ ఎన్నికల్లో వందశాతం పోలింగ్ లక్ష్యంగా శనివారం ప్రజలను జాగృతి పరిచే ర్యాలీ చేపట్టారు. కృష్ణగిరి మున్సిపల్ స్పోర్ట్స్ గ్రౌండ్‌లో శనివారం ర్యాలీకి కలెక్టర్ సరయు పచ్చజెండా ఊపారు. జిల్లా యంత్రాంగం తరపున ఓటు హక్కు వినియోగంపై ప్రజలను చైతన్య పరిచేలా సంతకాల అభియాన, ప్రతిజ్ఞ చేయించడం, క్రీడా పోటీలు, వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, 18ఏళ్ల పైబడినవారంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. నా ఓటు నా హక్కు అనే అంశంపై సెల్ఫీ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కొన్ని చోట్ల కళా ప్రదర్శనలు, నాటక కళాకారులచే జాగృతి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. హోసూరు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, ఎంజీఆర్ కళాశాల ఆఫ్ ఆర్ట్స్, హోసూరు ఒకేషనల్ చైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఆరాధన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, దేవదాయ శాఖ, హోసూరు కార్పొరేషన్ అధికారులు 500మంది అవగాహన బ్యానర్లు పట్టుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి వందనకార్గే, హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ స్నేహా, హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు

హోసూరు, మార్చి 23: తమిళనాడులో ఏప్రిల్ 19న ఒకే విడతలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న తరుణంలో సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. ఎన్నికల వేళ ఎలాంటి అక్రమాలకు అవకాశం ఇవ్వరాదని జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టర్ సరయు వెల్లడించారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులలో అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశాకనే అనుమతిస్తున్నారు. రికార్డులు లేకుండా భారీ నగదు, బహుమతులను అనుమతించేది ఉండదన్నారు. శనివారం స్వయంగా పలు చెక్‌పోస్టులను ఆమె పరిశీలించారు. హోసూరులో సరిహద్దు ప్రాంతాలైన జూజువాడి, బాగలూరు, కొత్తకొండపల్లి, తళి, అంచట్టి, తదితర ప్రాంతాల్లో పోలీసులతో కలసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. జూజువాడి చెక్‌పోస్ట్‌లో తనిఖీల సందర్భంగా వీడియో ఫుటేజీలను పరిశీలించి కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. అధికారులకు పలు సలహా, సూచనలు చేశారు.

డీఎంకే అభ్యర్థి విజయానికి కృషి : ఎమ్మెల్యే

హోసూరు, మార్చి 23: లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి అభ్యర్థి విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని హోసూరు ఎమ్మెల్యే వై ప్రకాశ్ పేర్కొన్నారు. స్థానిక ఆంధ్రసాంస్కృతిక సమితిలో శనివారం పార్టీ ప్రతినిధులు, కార్యకర్తల సమావేశాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగించారు. బూత్‌స్థాయి కమిటీ ముఖ్యులు, కార్యకర్తలు మరింత చురుగ్గా వ్యవహరించాలన్నారు. తమ పరిధిలో వందశాతం పోలింగ్ నమోదయ్యేందుకు పాటుపడాలని సూచించారు. మిత్రపక్షాలతో స్నేహ పూర్వకంగా ఉండి వారిని కలుపుకుని ముందుకు సాగాలన్నారు. 40 ఎంపీ స్థానాలను కైవశం చేసుకునేలా సీఎం ఎంకే స్టాలిన్ కృషి చేస్తున్నారని మనం కూడా కష్టపడాలన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే వై.ప్రకాశ్

భగత్‌సింగ్ ఆశయాలను సాధిద్దాం



భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఏఐడీవైఓ నేతలు

రాయచూరు, మార్చి 23: భగత్‌సింగ్ కలలుగన్న సమసమాజ నిర్మాణం కోసం యువకులు విద్యావంతులు అవిశ్రాంత కృషి సాగించాలని ఏఐడీవైఓ జిల్లాధ్యక్షుడు చన్నబసవ జానేకల్ కోరారు. భగత్‌సింగ్ కలలుగన్న సమసమాజ నిర్మాణంలో నేటి పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం భగత్‌సింగ్‌తో పాటు అమరవీరులు సుఖ్‌దేవ్, రాజగురుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన ధరల పెరుగుదల, నిరుద్యోగం, పేదరికం, మహిళలపై దాడులు, అత్యాచారాలు నేటి సమాజంలో పరిపాటిగా మారాయన్నారు. వీటిని నిర్మూలించడంతోపాటు ప్రజలందరికి సమాన హక్కులు కల్పించే దిశగా విద్యార్థులు, యువకులు నిరంతర కృషి సాగించాలని కోరారు.

కాలం చెల్లిన మందులతో గొర్రెల మృతి

రాయచూరు, మార్చి 23: సింధనూరు తాలూకా కొప్పళ క్యాంప్ పశువైద్య ఆస్పత్రి ముందు శనివారం రైతులు ఆందోళనకు దిగారు. మస్కి తాలూకా రత్నాపుర హట్టి గ్రామానికి చెందిన హనుమంతు గొర్రెలు అస్వస్థతకు గురి కాగా పశువుల ఆస్పత్రికి తీసుకొచ్చారు. వాటికి చికిత్సనందించిన వైద్యులు మందులు ఇవ్వగా ఆ మందుల ప్రభావంతో గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఆ మందుల్లో అప్పటికే ఎక్స్పైరీ డేట్ అయినవి ఉండడాన్ని గమనించిన రైతులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. అంతేకాకుండా మందులు ఇచ్చేందుకు డాక్టర్ శరణేగౌడ రూ.21 వేల లంచం అడిగారంటూ బాధితులు ఆందోళనకు దిగడంతో ఒక్కసారిగా కలకలం ఏర్పడింది.



సింధనూరు ఆస్పత్రి వద్ద గొర్రెల కళేబరాలు

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

ముత్తుస్వామి దీక్షితులు (జయంతి)



ముత్తుస్వామి దీక్షితర్ (దీక్షితులు) 1775 మార్చి 24న తంజావూరులో జన్మించారు. కర్ణాటక సంగీతత్రయంలో ఒకరైన వాగ్గేయకారుడు, వీణ విద్వాంసులు. ఆయన కృతులు తెలుగుకంటే సంస్కృతంలో అధికంగా రాయబడ్డాయి. 'గురు గుహ' అనేది వీరి మకుటం. 500కుపైగా కీర్తనలు రాశారు. సంగీత, వ్యాకరణ, జ్యోతిష్య, వాస్తు, మాంత్రిక వైద్యవిద్యలలో ఆరితేరిన వ్యక్తి. కర్ణాటక సంగీతంలో ఏడు ప్రాథమిక తాళాల్లో కృతులు చేసిన ఏకైక స్వరకర్త. 72 మేళకర్త రాగాలలో కృతులు రచించారు. 'శివ పాహి ఓం శివే' మంత్రాన్ని ఉచ్చరిస్తున్న వేళ 1835 అక్టోబరు 21న తనువు చాలించారు.

టీఎం సౌందరరాజన్ (జయంతి)



టీఎంఎస్‌గా చిరపరిచితులైన 'పద్మశ్రీ' గ్రహీత టీఎం సౌందరరాజన్ 1922 మార్చి 24న మధురైలో జన్మించారు. తమిళ సినీ రంగంలో ప్రజాదరణ పొందిన నేపథ్య గాయకుడు. ఆరు దశాబ్దాలపాటు దక్షిణా దిన 11 భాషలలో ప్రముఖ నటుల పాటలు పాడారు. 5వేలకుపైగా సినిమాలకు 20వేలకుపైగా పాటలు పాడారు. అంతేకాక 3వేలకుపైగా భక్తిపాటలు ఆలపించారు. శాస్త్రీయ సంగీత కచేరీలు సైతం నిర్వహించారు. కలైమామణి, కళారత్నం తదితర పురస్కారాలు పొందారు. 2013 మే 15న కన్నుమూశారు.

ఇమ్రాన్ హష్మి (పుట్టినరోజు)



సయ్యద్ ఇమ్రాన్ అన్వర్ హష్మి 1979 మార్చి 24న ముంబైలో జన్మించారు. 2003లో ఫుట్‌పాత్ చిత్రంతో సినీరంగంలోకి అడుగు పెట్టారు. పలు విభిన్న పాత్రలలో నటించి 3 ఫిలింఫేర్ అవార్డులు అందుకున్నారు. 2016లో కుమారుడు కేన్సర్‌ను అధిగమించడంపై 'కిస్ ఆఫ్ లైఫ్' పేరిట ఆటో బయోగ్రఫీ పుస్తకాన్ని రాశాడు. ప్రస్తుతం టైగర్-3, సెల్ఫీ అనే సినిమాలలో నటిస్తు న్నా రు. వివిధ ఉత్పత్తులకు రాయబారిగా వ్యవహరిస్తున్నారు.

యదువీర్ కృష్ణదత్త చామరాజ ఒడయార్ (పుట్టినరోజు)



మైసూరు యువరాజు యదువీర్ కృష్ణదత్త చామరాజ ఒడయార్ 1992 మార్చి 24న జన్మించారు. అసలు పేరు యదువీర్ గోపాల్‌రాజ్ అరసు. 23వ యేట మైసూరు యువరాజుగా పట్టాభిషిక్తు లయ్యారు. మైసూరు సంస్థానానికి 27వ వారసుడిగా వ్యవహరిస్తున్నారు. పూర్వీకుల తరహాలో తనవంతుగా విద్య, పర్యావరణ అంశాలపై ప్రజలలో చైతన్యం కలి గిస్తున్నారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల్లో మైసూరు నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

చౌడేశ్వరీదేవి పూజల్లో ఎమ్మెల్యే

చేళూరు, మార్చి 23: సరిహద్దులోని బిళ్యారుకు అనుబంధంగా ఉన్న అమడగూరులో వెలసిన చౌడేశ్వరి దేవాలయంలో శుక్ర, శనివారాలలో నిర్వహించిన విశేషపూజల్లో బెంగళూరు దక్షిణ ఎమ్మెల్యే కృష్ణప్ప కుటుంబంతో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారు తమకు ఇలవేల్పు కావడంతో తరచుగా ఇక్కడి అమ్మవారిని దర్శించుకుంటున్నామన్నారు. అమ్మవారు భక్తుల కొంగుబంగారంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందించనున్నట్టు తెలిపారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. ఈ సంద ర్భంగా శ్రీనివాసరెడ్డి, సురేందర్‌రెడ్డి, మూర్తి, రమేశ్, రామిరెడ్డి, షబ్బీర్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

హోళీ వేళ
రంగుల రసాయనాలు వద్దు

బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): హోళీ ఆనందంగా జరుపుకొనే పండుగ అని రసాయనాలతో కూడిన రంగులను చల్లుకోరాదని తద్వారా తీవ్రమైన సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి నిపుణులు దేవరాజ్ సూచించారు. ఈమేరకు ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ రసాయనాలతో కూడిన రంగులు చల్లడం ద్వారా కళ్లకు తీవ్రమైన సమస్య ఏర్పడుతుందన్నారు. సింథటిక్ కలర్‌లు, వాటర్ బెలూన్‌లు కళ్లకు ప్రమాదకరమన్నారు. సహజసిద్ధమైన రంగులతో హోళీని ఉత్సాహవంతంగా జరుపుకోవాలన్నారు. హోళీలో పాల్గొనేవారు సన్‌గ్లాస్ లేదా పెద్దసైజు కళ్లజోడును ధరించాలన్నారు. రంగుల నీళ్ల కళ్లలో పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. సమస్య అనిపిస్తే వెంటనే వైద్యుల చెంతకు తీసుకెళ్లాలని, సొంత చికిత్సలు చేసుకోరాదన్నారు. డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రిలో హోళీ వేళ ప్రత్యేక విభాగం పనిచేస్తుందన్నారు.

మాజీ ఎంపీ
మూడలగిరియప్ప కన్నుమూత



మాజీ ఎంపీ మూడలగిరియప్ప (ఫైల్)

బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తుమకూరు మాజీ ఎంపీ మూడలగిరియప్ప (84) బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సలు పొందుతూ శనివారం కన్నుమూశారు. శ్వాసకోసతో పాటు వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు బుధవారం ఆసుపత్రిలో చేర్చారు. చికిత్సలు ఫలించకపోవడంతో తుదిశ్వాస వీడారు. ఆయనకు భార్య లక్ష్మీదేవమ్మ, కుమార్తె డాక్టర్ కవిత, కుమారుడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీఎం రాజేష్‌గౌడలు ఉన్నారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. కాంగ్రెస్ నుంచి రాజ కీయాలు ఆరంభించిన మూడలగిరియప్ప 1985లో శిరా ఎమ్మెల్యేగా గెలుపు సాధించారు. ఆ తర్వాత 1989, 1991, 1998లలో వరుసగా మూడుసార్లు తుమకూరు లోక్‌సభ సభ్యుడిగా విజయం సాధించారు. 2020లో శిరా స్థానా నికి జరిగిన ఉప ఎన్నికలలో మూడలగిరియప్ప కుమా రుడు డాక్టర్ రాజేష్‌గౌడ గెలుపొందారు.

ఎన్నికల అక్రమాలపై కొరడా

» భారీగా నగదు స్వాధీనం

» పలుచోట్ల తనిఖీలు - పోలీసు కవాతు

బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. రాష్ట్రమంతటా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘాను విధించామని తెలిపింది. ఈమేరకు నగరంలో శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి 15.78 కోట్ల రూపాయల నగదు, 17.35 లక్షల విలువైన బహుమతులు, రూ.1.98 కోట్ల విలువైన ఇతర వస్తువులు, రూ.23.37 కోట్ల విలువైన మద్యం, 65.71 లక్షల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపింది. వీటన్నింటికి సంబంధించి 496 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్టు తెలిపింది. రౌడీషీటర్‌లనుంచి ముందస్తుగా తుపాకులు, ఇతర మారణాయుధాలను సీజ్ చేశామని, అన్ని పోలీస్ స్టేషన్‌లలోనూ మాజీ నేరస్తులకు హెచ్చరికలు జారీ చేయిస్తున్నామని తెలిపింది. రాష్ట్ర పోలీసుల సహకారంతో ఎన్నికల ప్రలోభాలకు అడ్డుకట్ట వేసేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించింది. నిఘా దళాలు రాత్రివేళల్లోనూ తనిఖీలు కొనసాగిస్తున్నాయని పేర్కొంది. అనుమానం వచ్చిన వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే వదిలిపెడుతున్నామని పేర్కొంది. పొరుగురాష్ట్రాలైన కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పోలీసుల సహకారంతో తనిఖీల ప్రక్రియలో పరస్పర సమాచారాన్ని వినిమయం చేసుకుంటున్నట్టు తెలిపింది.



కారును పరిశీలిస్తున్న పోలీసులు



బూదికోటెలో పోలీసుల కవాతు

ఓటర్లకు అండగా పోలీసుశాఖ - డీఎస్పీ పాండురంగ

బంగారపేట, మార్చి 23: ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఓటర్లకు అండగా పోలీసుశాఖ ఉందని డీఎస్పీ పాండురంగ పేర్కొన్నారు. తాలూకాలోని బూదికోటెలో శనివారం పోలీసు కవాతు సందర్భంగా ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కవాతు నిర్వహించామన్నారు. బూదికోటె ప్రాంతం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు కావడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా ప్రజలంతా సహకరించలన్నారు. అక్రమాల నియంత్రణకు పోలీసుశాఖ సదా సిద్ధంగా ఉంటుందన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. పోలీసు పథసంచలనం డీఎస్పీ పాండురంగ నేతృత్వంలో బూదికోటె, ముతనూరు, భువనహళ్ళి గ్రామాలలో సాగింది. ఈ సందర్భంగా సీఐ నంజప్ప, పురుషోత్తమ్, కృష్ణప్ప, మంజునాథ్, లక్ష్మీనారాయణ, సునీల్, రేవణ్ణసిద్దప్ప, సంగమేశ్, అప్పలాల్, మంజణ్ణ, జగదీశ్, నాగప్ప, పాలాక్ష, గురురాజ్, ఎస్‌బీ నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

చింతామణిలో...

చింతామణి, మార్చి 23: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చింతామణి పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో శనివారం పోలీసులు పథసంచలనం నిర్వహించారు. జిల్లా ఎస్పీ సూచన మేరకు పట్టణంలోని డబుల్‌రోడ్డులోగల డీఎస్పీ కార్యాలయం నుంచి ఎంజీ రోడ్డు, ఆజాద్‌చౌక్, దొడ్డపేట, నెక్కుందిపేట, పటాలమ్మ, దేవాలయ అగ్రహార, మహబూబ్‌నగర, ఎస్ఎన్‌టీ రోడ్డు, నారసింహపేట మీదుగా పోలీసు కవాతు సాగింది. డీఎస్పీ మురళీధర్ నేతృత్వం వహించి మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కు నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి ఆందోళన చెందకుండా ఓటు వేయాలన్నారు. పట్టణ సీఐ వీజీ కుమార్, రూరల్ స్టేషన్ సీఐ శివరాజు, ఎస్సైలు, సయ్యద్‌అన్సర్‌పాష, నాగరాజ్, మమత, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



బెంగళూరులో పోలీసుల తనిఖీలు



చింతామణిలో డీఎస్పీ నేతృత్వంలో కవాతు

పౌష్టికాంశాలు పుష్కలంగా కలిగిన ఖర్జూరం

» రంజాన్ నెలలో రాజధానిలో 500 టన్నులకు పైగా విక్రయం



విదేశీ ఖర్జూర పండ్లను ఆసక్తిగా తిలకిస్తున్న సందర్శకులు

బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు దాదాపు 12 గంటలకు పైగా సాగే తమ ఉపవాస వ్రతాన్ని కేవలం ఒక ఖర్జూర పండుతో విరమిస్తారు. ఇందుకు కారణమేమంటే గంటల కొద్దీ అన్నపానీయలను తీసుకోని కారణంగా దేశంలోని చక్కెర ప్రమాణం గణనీయంగా తగ్గిపోతుంది. ఒకటీ రెండు ఖర్జూర పండ్లను సేవించడం వల్ల కొద్దినిముషాల అవధిలోనే శరీరం మళ్ళీ శక్తిని పుంజుకుంటుంది. ఔషధ గుణాలు, పౌష్టికాంశాలు పుష్కలంగా కలిగిన ఖర్జూర పండ్లను అన్ని వర్గాల ప్రజలు ఎంతో ఇష్టంగా స్వీకరిస్తున్నారు. బెంగళూరు శివాజీనగర్‌లో ఖర్జూర పండ్ల మేళా ఏర్పాటైన నేపథ్యంలో రస్సెల్‌మార్కెట్ వ్యాపారస్తుల సంఘం ప్రధాన కార్యదర్శి మొహ్మద్ ఇద్రిస్ చౌదరి శనివారం మీడియాతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా 350కు పైగా రకాల ఖర్జూర పండ్ల రకాలు ఉండగా అందులో అత్యంత విశిష్ట ఔషధ గుణాలు కలిగిన 42 రకాల ఖర్జూర పండ్లను నగర ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు ప్రత్యేకించి సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్, జోర్డాన్, ట్యునీషియా, దక్షిణాఫ్రికా దేశాల నుండి వచ్చే ఖర్జూర పండ్లను ప్రజలు అమితంగా ఇష్టపడతారన్నారు.

ఎన్నెన్నో రకాలు...



రకరకాల ఖర్జూరం పండ్లు

ఖర్జూర పండ్లలో ఎన్నెన్నో రకాలు ఉన్నాయని ఇద్రీస్ చెప్పారు. చక్కెర వ్యాధి ఉన్నవారికోసం మేడ్జాల్ రకం ప్రత్యేకమన్నారు. కాగా రుత్బ సుక్రి, సఖారి, కల్మి, అంబర, మరియం, మబరూమ్ ఖుద్రి ఇలా రూ కిలో వంద రూపా యల నుండి కిలో రెండు వేల రూపాయల విలువ చేసే ఖర్జూర పండ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతిఏటా రంజాన్ మాసంలో తమ మేళాలో కనీసం 15 టన్నుల వరకు ఖర్జూర పండ్ల విక్రయం జరుగుతుందని ఆయన వివరించారు. నిత్యం రెండు మూడు ఖర్జూర పండ్లు, కొన్ని బాదం పప్పులు ఒక గ్లాసు పాలతో కలిపి తీసుకుంటే అద్భుతమైన రోగనిరోధక శక్తి, ఎముకల పుష్టి, రక్త శుద్ధీకరణ, వంటి ప్రయోజనాలు దక్కుతాయన్నారు. హృద్రోగ సమస్యలు, కిడ్నీ సమస్యలు ఉన్నవారికి ఖర్జూర పండ్లు దివ్యఔషధమన్నారు. ఖర్జూరపండ్లలో అద్భుతమైన ఔషధ గుణాలున్నాయని పలు పరిశోధనల్లో శాస్త్రీయంగా రుజువైందన్నారు. తమకు తెలిసి బెంగళూరు నగరంలో ప్రతియేటా 500 టన్నుల వరకు ఖర్జూర పండ్ల విక్రయం జరుగుతుంటుందని ఇద్రీస్ వివరించారు. ఈ సారి ప్రత్యేక ఆకర్షణగా ఎనర్జీ టానిక్ డేట్‌సిరప్, ఖర్జూర హల్వాలను ఉంచామన్నారు. బీబీఎంపీ నిర్వహణలోని రస్సెల్‌మార్కెట్‌లో అద్దె తదితర నిర్వహణా ఖర్చులు తక్కువ కావడంతో లాభాలలో కొంత భాగాన్ని వినియోగదారులకే తిరిగి ఇస్తున్నామని రాయితీలతో పాటు ఒకటి కొంటే మరొకటి ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. రకరకాల అరుదైన విభిన్న రుచుల ఖర్జూర పండ్లను ఆస్వాదించాలంటే శివాజీనగర్‌లోని రస్సెల్ మార్కెట్ మేళాను రంజాన్ మాసంలో సందర్శించాల్సిందే మరి.

మహిళా స్వావలంబనతో సమాజ ప్రగతి



అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

బంగారపేట, మార్చి 23: మహిళలు స్వావలంబనకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా కుటుంబంలోనూ, సమాజంలోనూ ప్రగతి సాధ్యమని విద్యాశాఖ బీఆర్‌సీ సంయోజకులు శశికళ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని అక్కచమ్మ కల్యాణమండపంలో ఫోకస్ ట్రస్ట్ స్వయం సేవాసంస్థ, బసవేశ్వర విద్యాసంస్థ, అక్షర దాసోహ ఉద్యోగుల సంఘం, జనవాది మహిళా సంఘం ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఖరీదైన వస్త్రాలు, ఆభరణాలు ధరించడం ద్వారా సమాజంలో గొప్పస్థానం లభించదని, సాధన తోనే గుర్తింపు దక్కుతుందని అభిప్రాయపడ్డారు. సమస్యలను సమర్థవంతంగా నిభాయించే మానసిక బలం పెంపొందించుకోవాలన్నారు. ఫోకస్ ట్రస్టు స్వయం సేవా సంస్థ ముఖ్యులు హరీశ్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో కార్యక్రమాన్ని సరళంగా నిర్వహించామన్నారు. బోడగుర్కి గ్రామ ఘటనపై జనవాది మహిళా సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేశారని, అదే రీతిన మహిళ దౌర్జన్యాలపై రాష్ట్రవ్యాప్తంగా పోరాటం జరగాలన్నారు. కార్యక్రమంలో జనవాది మహిళా సంఘం రాష్ట్ర ప్రముఖులు గౌరమ్మ, అక్షర దాసోహ కార్యదర్శి లలితమ్మ, అక్షర దాసోహ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎంఎన్ రవీంద్ర, ముక్త మహిళా వేదిక లక్ష్మమ్మ, సరస్వతి, నారాయణస్వామి, అజయ్, అను ప్రియ, అమరావతి, అనితా, భారతి, నాగలాంబికె తదితరులు పాల్గొన్నారు.

'ఇండియా' కూటమిలో నాయకుల కొరత

» పదేళ్లలో మోదీ ఎంతో ఎత్తుకెదిగారు : ప్రతిపక్షనేత అశోక్



మీడియా సెంటర్ ప్రారంభంలో ప్రతిపక్షనేత అశోక్ తదితరులు

బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందే 'ఇండియా' కూటమి నేతలు ఓటమిని అంగీకరించారని ప్రతిపక్షనేత ఆర్ అశోక్ వ్యాఖ్యా నించారు. బెంగళూరు మల్లేశ్వరం బీజేపీ మీడియా కార్యాలయాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రతో కలసి లాంఛనగా ప్రారంభించారు. అనంతరం మా ట్లాడుతూ ఇండియా కూటమికి కేప్టెన్ లేరన్నారు. బీజేపీ కేప్టెన్ నరేంద్రమోదీ పోటీలో దూసుకుపోతుంటే, కేప్టెన్ లేక 'ఇండియా' కూటమి చతికిల పడిందన్నారు. నాలుగురాష్ట్రాల శాసనసభ ఎన్నికల సెమీ ఫైనల్స్‌లో మూడిం టినీ భారీ మెజారిటీతో గెలిచామని ఇప్పుడు ఫైనల్స్‌లో కూడా ఘన విజయం అందుకోబోతున్నామన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ అనుకూల గాలులు బలంగా వీస్తున్నాయన్నారు. మేకెదాటు ప్రాజెక్టుపై కాంగ్రెస్ తన విధానాన్ని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టిన కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. గ్యారెంటీ పథకాలతో ఖజానా దివాళా తీసిందన్నారు. పార్టీ మీడియా సెంటర్‌లో జాతీయ, అంతర్జాతీయ ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా విభాగాలకు అవసరమైన అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 28 లోక్‌సభ నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగామన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

ఘనంగా చెన్నరాయస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో అర్చకులు

శిడ్లఘట్ట, మార్చి 23: తాలూకాలోని హేమార్లహళ్ళి గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నరాయస్వామి తిరుకల్యాణ మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఇదే సందర్భంగా చౌడేశ్వరి దేవి మండలపూజ నిర్వహించారు. సమాజసేవకుడు పుట్టు ఆంజినప్ప ఉత్సవాల్లో పాల్గొన్న అనంతరం మాట్లాడుతూ గ్రామస్థులు, భక్తుల సహకారంతో ఏడెనిమిది సంవత్సరాల కృషితో ఆలయాన్ని నిర్మించి ప్రస్తుతం స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని కోరినట్టు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు పిళ్ళనారాయణస్వామి, మహేశ్, మంజునాథ్, వెంకటేశ్, హోసపేట శశికుమార్, కాళనాయకనహళ్ళి రమేశ్, బుస్సనహళ్ళి రమేశ్, మళమాచన హళ్ళి మునిరాజు, అప్సర్, తుమ్మనహళ్ళి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నియంత్రణా చర్యలపై
మరిన్ని పరిశోధనలు అవసరం



సదస్సులో పాల్గొన్న వైద్యనిపుణులు

బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సమాజంలో క్యాన్సర్ ప్రభావం పెరుగుతోందని నియంత్రణా చర్యలపై మరిన్ని పరిశోధనలు అవసరమని రాజీవ్‌గాంధీ వైద్య విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఎంకే రమేశ్ అభిప్రాయపడ్డారు. గ్లోబల్ హెల్త్‌కేర్ అకాడమీ నుంచి బెస్ట్ ఆఫ్ ఏఎస్‌సీఓ సదస్సులో భాగంగా శనివారం ఆయన ప్రసంగించారు. హెల్త్‌కేర్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్ అడ్వైజర్ డాక్టర్ రాధేశ్యామ్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ బీఎస్ అజయ్‌కుమార్‌లు పాల్గొన్నారు. ఇమ్యునోథెరపీ ద్వారా క్యాన్సర్ చికిత్సపై 15ఏళ్ల ప్రగతిని సమీక్షించారు. డాక్టర్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ బాధితులు కోలుకోవడం సాధారణ జీవనం వైపు రావడమే కీలకమన్నారు. డాక్టర్ ఎంకే రమేశ్ మాట్లా డుతూ ఇమ్యునో థెరపీ విధానాలు ప్రస్తుతం అమలులో ఉన్నా మరిన్ని ఆవిష్కరణలు కొనసాగాల్సి ఉందన్నారు. యునైటెడ్ కింగ్‌డమ్ వైద్య నిపుణుడు ఆంద్ర్యూ వార్డ్‌లే మాట్లాడుతూ కేన్సర్‌పై చర్చలు అంతర్జాతీయ స్థాయిలో కొనసాగాలని, ప్రపంచమంతటా ఏటా బాధితులు పెరుగు తున్నారన్నారు. సైంటిఫిక్ కమిటీ చైర్మన్ డాక్టర్ గోవిందబాబు సహా పలువురు పాల్గొన్నారు.

తెలంగాణకు గరుడ బస్సులు పెంచండి
- ప్రయాణికుల డిమాండ్

బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరం నుంచి హైదరాబాద్ సంచరించే ప్రయాణీకులకు ఇటీవల తీవ్రమైన సమస్య ఏర్పడిందని వెంటనే గరుడ బస్సు సర్వీసులు పెంచాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. బెంగళూరు నుంచి నిత్యం హైదరాబాద్‌కు వేలాది మంది రాకపోకలు సాగించేవారు ఉన్నారు. అందుకు తెలంగాణ, కర్ణాటక ఆర్టీసీలతో పాటు రైళ్ళు, విమానసర్వీసులను ఉపయోగిస్తారు. రైళ్లలో ప్రయాణించేందుకు రిజర్వేషన్ లభించని కారణంగా ఎక్కువ మంది వెనుకంజ వేస్తుంటారు. విమానంలో ప్రయాణించాలంటే ఇటు బెంగళూరు నుంచి ఎయిర్‌పోర్టుకు, అటు రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్టు నుంచి హైదరాబాద్‌కు కార్లలో వెళ్ళడం అదనపు భారంగా భావిస్తున్నారు. బెంగళూరు నుంచి తెలంగాణ రాష్ట్ర పరిధిలోని ప్రధాన నగరాలు కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, గోదావరిఖనితో పాటు హైదరాబాద్‌కు నిత్యం సర్వీసులు ఉన్నాయి. గతంలో 14 సర్వీసులు గరుడ ఎక్స్‌ప్రెస్‌లు కాగా లహరి ఏసీ స్లీపింగ్ సీటర్ సర్వీసు ఉండేది. ఫిబ్రవరి 15 నుంచి గరుడ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు. అన్ని ప్రాంతాలకు ఏసీ స్లీపర్‌కం సీటర్ లహరీ సర్వీసులు ఏర్పాటు చేశారు. అన్ని ఏసీ స్లీపర్ బస్సులు ఉండటంతో సామాన్యుల అదనపు సొమ్ము భరించి ప్రయాణించే పరిస్థితి లేకుండా పోతోంది. బెంగళూరు - హైదరాబాద్‌ల మధ్యన వారంతంలో ఐటీబీటీతో పాటు విద్య, వ్యాపార రంగాలకు చెందిన వారు ప్రయాణిస్తుంటారు. వారు అత్యధిక సొమ్ము చెల్లించి ప్రయాణించలేమంటున్నారు. వెంటనే తెలంగాణ ఆర్టీసీ ముఖ్యులు సమస్యను పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

హావేరి, రాణిబెన్నూరుకు
తుంగభద్ర నుంచి నీటిని అందించాలి

బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కరువు తీవ్రత నేపథ్యంలో తాగునీటి సమస్య ఎదుర్కొంటున్న హావేరి, రాణిబెన్నూరు ప్రజలను ఆదుకోవాలని ప్రభుత్వానికి మాజీ ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం జిల్లాధికారికి ఆయన ఫోన్‌చేశారు. తుంగభద్ర నది నుండి తక్షణం తాగునీటి అవసరాల కోసం ఈ రెండు ప్రాంతాలకు నీటిని విడుదల చేయాలని లేనిపక్షంలో పరిస్థితి చేయిదాటే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రస్తుత వేసవిలో ప్రజల తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యతనివ్వాలని ఆయన జిల్లాధికారిని కోరారు.

హోళీ కోసం ఆర్టిజన్ బజార్




కళాఖండాలతో మోడల్ వీక్షిత్‌గౌడ

బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రంగుల పండుగ హోళీ కోసం దేశంలోని వివిధ ప్రాంతాల డిజైన్‌లు, ఆభరణాల మేళా ఆర్టిజన్ బజార్ ఏర్పాటు చేశారు. నగరంలోని చిత్రకళాపరిషత్‌లో ఏర్పాటు చేసిన ఆర్టిజన్ బజార్‌ను ప్రముఖ మోడల్ వీక్షిత్‌గౌడ ఆరంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనదేశం కళలకు పుట్టినిల్లు అని శతాబ్దాలకాలంగా కొన్ని వృత్తులపై కళాకారులు ఆధారపడ్డారన్నారు. వారిని ప్రోత్సహించేలా మేళాలు ఏర్పాటు చేశారన్నారు. నెలాఖరువరకు మేళా కొనసాగుతుందన్నారు.

స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన అధికారులు

చింతామణి, మార్చి 23: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చింతామణి శాసనసభ నియోజకవర్గ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో స్ట్రాంగ్ రూం, మస్టరింగ్, డిమస్టరింగ్, ట్రైనింగ్ సెంటర్‌ను కోలారు జిల్లా ఎన్నికల అధికారి అక్రంపాషా శనివారం పరిశీలించారు. ఇదే సందర్భంగా జిల్లా పాలకవర్గం, జిల్లా పంచాయతీ, తాలూకా స్వీప్ సమితి, తాలూకా పంచాయతీ సంయుక్తంగా బెంగళూరు డబుల్ రోడ్డులోని తాలూకా పంచాయతీ కార్యాలయంలో స్వీప్ కమిటీలతో ఓటర్లను జాగృత పరిచేలా సంతకాల అభియానకు శ్రీకారం చుట్టారు. ఎటువంటి ప్రచారం లేకుండానే కార్యక్రమాన్ని ప్రారంభించడం గమనార్హం.

వినూత్నంగా ఓటు వినియోగంపై జాగృతి



జాగృతిలో మొక్కలు పంపిణీ

శిడ్లఘట్ట, మార్చి 23: లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కు విని యోగించు కోవాలని తాలూకా పంచాయతీ కార్యనిర్వాహక అధికారి మునిరాజు పిలుపునిచ్చారు. తాలూకా స్వీప్ సమితి ఆధ్వర్యంలో శనివారం బస్టాండ్ వద్ద ఓటు హక్కు వినియోగంపై వినూత్నంగా జాగృతి నిర్వహించారు. మొక్కలకు నీరు పోసి కార్యక్రమాన్ని పంపిణీ చేసి కొంతమందికి మొక్కలు పంపిణీ చేశారు. 18ఏళ్ల పైబడినవారంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఓటు వేయడం మన హక్కు అని తప్పక పాటించాలన్నారు. ఈ సందర్భంగా సీడీపీఓ నౌతాజ్, సామాజిక వలయ అటవీఅధికారి నాగార్జున, కమిషనర్ రంగనాథరెడ్డి తాలూకా స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా మెటా థియేటర్ అవార్డులు



రామ్‌గోపాల్‌బజాజ్‌కు జీవనసాఫల్య పురస్కారం

బెంగళూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మహేంద్ర ఎక్సలెన్స్ అండ్ థియేటర్ (మెటా) అవార్డుల ప్రదానం ఉత్సాహభరితంగా సాగింది. కమాని ఆడిటోరియంలో 19వ విడత మెటా అవార్డుల ప్రదానం శుక్రవారం రాత్రి జరిగింది. భారతీయ రంగస్థలంలో అత్యంత మహత్తరమైన అవార్డుల కార్యక్రమమిది. జాతీయ స్థాయిలో 390 ఎంట్రీలలో ఎంపికలే కీలక ఘట్టంగా సాగాయి. డైరెక్టర్, రచయిత డాలీ ఠాకూర్, ప్రముఖ నటుడు కులభూషణ్ ఖర్బందా, దర్శకులు, నటుడు మహేశ దత్తాని, సంగీతదర్శకుడు గాయకుడు రఘువీర్ యాదవ్, ఆర్ట్ ఫెస్టివల్ డైరెక్టర్ స్మృతిరాజ్ గర్షియా, చలనచిత్ర నటుడు వినయ్ పాఠక్‌లు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. మహేంద్ర గ్రూప్ కల్చరల్ అవుట్‌రీచ్ వైస్ ప్రెసిడెంట్ జైశా, ఫెస్టివల్ ప్రొడ్యూసర్ సంజయ్ కే రాయ్‌లు ముఖ్యులుగా పాల్గొన్నారు. 13 విభాగాలలో ఉత్తమ పుర స్కారాలు ప్రదానం చేశారు.